సీజనల్ వ్యాధులతో జాగ్రత్త

- ఆరోగ్యం విషయంలో ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలి
- ఫీవర్ ఆస్పత్రి ఇన్‌చార్జి సూపరింటెండెంట్ డాక్టర్ జయలక్ష్మి

వర్షాకాలంలో సాధారణంగా వచ్చే సీజనల్ వ్యాధుల నుంచి రక్షణ పొందేందుకు ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని నల్లకుంట ఫీవర్ ఆస్పత్రి ఇన్‌చార్జి సూపరింటెండెంట్ డాక్టర్ జయలక్ష్మి సూచించారు. ఈ కాలంలో ఎక్కువగా నీళ్ల విరేచనాలు, టైఫాయిడ్, డెంగీ, మలేరియా, చికూన్ గన్యా, మెదడు వాపు లాంటి వ్యాధులు రాకుండా పలు జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. – నల్లకుంట



ఇవీ తీసుకోవాల్సిన జాగ్రత్తలు..

- ప్రతి ఒక్కరూ కాచి చల్లార్చి వడకట్టిన నీటిని మాత్రమే తాగాలి.
- అప్పుడే వండిన ఆహారాన్ని భుజించాలి. నిల్వ ఉంచిన, ఫ్రిజ్‌లో ఉంచిన ఆహారం తినొద్దు.
- తాగునీరు, వండిన ఆహారం పాత్రలపై శుభ్రమైన మూతలు ఉంచాలి.
- ఇంట్లో, పరిసరాల్లో దోమలు, ఈగలు లేకుండా చూసుకోవాలి.
- వంట చేయడానికి ముందు తర్వాత, భోజనం చేసే ముందు సబ్బుతో చేతులు శుభ్రం చేసుకోవాలి.
- బయట ఆహార పదార్థాలు, ఇంట్లో ఈగలు వాలిన ఆహార పదార్థాలు, జంక్ ఫుడ్స్ తినొద్దు.
- ప్రతి రోజు స్నానం చేసిన తర్వాత ఉతికిన బట్టలను ధరించాలి. కాలకృత్యాల తరువాత సబ్బుతో చేతులు శుభ్రం చేసుకోవాలి.
- వృద్ధులు, పిల్లలు, గర్భిణులు, బాలింతలు చల్లటి గాలిలో తిరగవద్దు. వానలో తడవకుండా తగు జాగ్రత్తలు పాటించాలి
- ఇంటి పరిసరాలను చెత్తాచెదారం లేకుండా పరి శుభ్రంగా ఉంచుకోవాలి.
- ఇంట్లో, పరిసరాల్లో పాత టైర్లు, టెంకాయ చిప్పలు, వాడి పడేసిన కొబ్బరి బోండాలు, వాడి పడేసిన ప్లాస్టిక్ వాటర్ బాటిళ్లు, రుబ్బు రోళ్ల వంటి వాటిలో నీరు నిలువ లేకుండా చూడాలి.
- వైద్య ఆరోగ్యశాఖ ప్రతి శుక్రవారం తలపెట్టిన ఫ్రై డే డ్రై డే కార్యక్రమంలో ప్రజలు భాగస్వాములు కావాలి.
- దోమలు ఇంట్లోకి రాకుండా ప్రధాన ద్వారాలు, కిటికీలక మెష్‌లు ఏర్పాటు చేసుకోవాలి. అలాగే ప్రతి రోజు వేపాకు పొగ వేయాలి. దోమలు కుట్టకుండా దోమ తెరలు ఉపయోగించడం మేలు.
- పగటి పూట డెంగీ దోమలు కుడుతాయి. వాటి నుంచి రక్షణ కోసం శరీరాన్ని పూర్తిగా కప్పి ఉంచేలా దుస్తులను ధరించాలి.
- జ్వరపీడితులు, వాంతులు, విరేచనాలతో బాధపడేవారు స్థానిక బస్తీ దవాఖానాలు, యూపీహెచ్‌సీలు లేదా ఫీవర్ ఆస్పత్రిలో వైద్యులను సంప్రదించి తగిన వైద్య సహాయం పొందవచ్చు. సొంత వైద్యం మంచిది కాదు.

నేడు 'బీసీ కుల సంఘాల ఐక్యత'పై రౌండ్‌టేబుల్ సమావేశం

కాచిగూడ: అఖిల భారత పద్మశాలి సంఘం రాజకీయ విభాగం ఆధ్వర్యంలో ఈనెల 26వ తేదీన నారాయణగూడలోని పద్మశాలి భవన్‌లో ఉదయం 10 గంటలకు 'బీసీ కుల సంఘాల ఐక్యత'పై రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహిస్తున్నట్లు సంఘం జాతీయ అధ్యక్షుడు కందగట్ల స్వామి, రాజకీయ విభాగం అధ్యక్షుడు బొల్ల శివ శంకర్ తెలిపారు. బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ.. బీసీల్లో ప్రధాన భూమిక పోషిస్తున్న అన్ని కుల సంఘాల ఐక్యత కోసం కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. బీసీల హక్కుల సాధన కోసం, రాజకీయ హక్కుల సాధన కోసం ఉద్యమించాలని వారు పిలుపునిచ్చారు. ఈ సమావేశానికి 100కు పైగా కుల సంఘాల ప్రతినిధులు, బీసీ సంఘాల ప్రతినిధులు, వివిధ రాజకీయ పార్టీల నేతలు, ప్రజాప్రతినిధులు పాల్గొంటారని తెలిపారు. బీసీలు అధిక సంఖ్యలో పాల్గొని తమ సూచనలు, సలహాలు తెలియజేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో అఖిల భారత పద్మశాలి సంఘం ప్రధానకార్యదర్శి గడ్డం జగన్నాథం, రాష్ట్ర అధ్యక్షుడు కమ్మర్తపు మురళి, మాచర్ల రాంచందర్, అవ్వారి భాస్కర్, కందగట్ల భిక్షపతి, గూడూరు శ్రీనివాస్, గుర్రం శ్రవణ్, నరేందర్, బిళ్ల దీపిక, బొమ్మ ప్రవళ్లిక, చిన్ని రాకేష్, బొమ్మ అమరేందర్ పాల్గొన్నారు.

స్త్రీనిధి కుంభకోణం దోషులను రక్షించే ప్రయత్నం మానుకోవాలి



బీఎల్పీ రాష్ట్ర వర్కింగ్ ప్రసిడెంట్ దండి వెంకట్

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: శ్రీనిధి అవినీతి కుంభకోణంలో దోషులను రక్షించే ప్రయత్నాన్ని మానుకోవాలని బహుజన లెఫ్ట్ పార్టీ (బీఎల్పీ) రాష్ట్ర వర్కింగ్ ప్రసిడెంట్ దండి వెంకట్ డిమాండ్ చేశారు. సీఎం పేషీ నుంచి దోషులను రక్షించే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆయన ఆరోపించారు. బుధవారం బాగ్‌లింగంపల్లిలోని తన కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. గత ప్రభుత్వ హయాంలో జరిగిన స్త్రీనిధి అవినీతి కుంభకోణంపై దర్యాప్తును వేగవంతం చేసి దోషులను కఠినంగా శిక్షించాలన్నారు. కుంభకోణానికి ప్రధాన సూత్రదారి ఆ సంస్థ ఎండీ విద్యాసాగర్‌రెడ్డి అని ఆరోపించారు. ఆ సంస్థకు ఎండీగా ఆయనను ఇంకా కొనసాగించడంలో ఆంతర్యం ఏమిటని ప్రశ్నించారు

ఆకట్టుకుంటున్న చేనేత వస్త్ర ప్రదర్శన



ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పద్మజ మాట్లాడుతూ...

కవాడిగూడ: ఎన్‌టీఆర్ స్టేడియంలో శ్రీ సాయి చేనేత కాటన్, సిల్క్ ఎక్స్‌పో ఆధ్వర్యంలో కొనసాగుతున్న చేనేత వస్త్ర ప్రదర్శన ఈనెల 29తో ముగుస్తుందని నిర్వాహకురాలు కంభంపాటి పద్మజ తెలిపారు. ఎన్‌టీఆర్ స్టేడియంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పద్మజ మాట్లాడుతూ... చేనేత హస్త కళాకారులు చూడముచ్చటైన చీరలు, మెటీరియల్స్ మగువలను విశేషంగా ఆకట్టుకుంటున్నాయని తెలిపారు. ఈ అవకాశాన్ని నగరవాసులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సెంట్రలైజ్డ్ కిచెన్ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలి

కాచిగూడ: సెంట్రలైజ్డ్ కిచెన్ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని.. వంట కార్మికుల అక్రమ తొలగింపును నిరోధిస్తూ జీఓ విడుదల చేయాలని.. వంట కార్మికులకు ఇస్తామన్న రూ.10వేల వేతన హామీని అమలు చేయాలని తెలంగాణ మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కమిటీ సమావేశం డిమాండ్ చేసింది. బుధవారం నారాయణగూడలోని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యాలయంలో యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు ప్రేంపావని అధ్యక్షతన రాష్ట్ర కమిటీ సమావేశం జరిగింది. అల్పాహారం బిల్లులు, వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. సమస్యలు పరిష్కరించకుంటే దసరా తరువాత సమ్మెలోకి వెళ్లాల్సి వస్తోందని హెచ్చరించారు. కార్మికులు పోరాటాలకు సన్నద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో యూనియన్ జాతీయ అధ్యక్షురాలు బీవీ విజయలక్ష్మి, ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి యస్.బాలరాజు, జంపాల రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

వీధులు అంధకారం!

నియోజకవర్గంలో 40శాతం వెలుగని వీధి దీపాలు

- మరమ్మతులకు నోచుకోని వైనం
- సమ్మెలో కాంట్రాక్టర్లు.. చేతులెత్తేసిన అధికారులు

అంబర్‌పేట: నియోజకవర్గంలోని వీధిలైట్లు వెలుగక పలు ప్రాంతాల్లో అంధకారంలో ఉన్నాయి. గత నెల రోజులుగా 40 శాతం వీధి దీపాలు వెలగడంలేదు. సాయంత్రం కాగానే ఆయా కాలనీలు, బస్తీలు చీకట్లో మగ్గుతున్నాయి. రాకపోకలకు స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చీకటి పడితే చిన్నారులు, వృద్ధులు బయటకు వెళ్లడానికి జంకుతున్నారు. పట్టించుకోవాల్సిన జీహెచ్‌ఎంసీ అధికారులు విఫలమవుతున్నారు. ఇప్పటికైనా వీధి లైట్లను వెలిగేలా చేయాలని పలువురు కోరుతున్నారు. నియోజకవర్గంలో సుమారు 20వేలకు పైగా వీధి దీపాలు ఉన్నాయి. అందులో దాదాపు 6 నుంచి 7 వేల వీధి దీపాలకు మరమ్మతులు చేయాల్సి ఉంది.





బాగ్ అంబర్‌పేటలో వీధి దీపాలు వెలుగని ప్రాంతాలు

సమ్మెలో కాంట్రాక్టర్లు..

వర్షకాలం, ఈదురుగాలులకు వీధిదీపాలు పాడైపోతున్నాయి. కీలక ప్రాంతాల్లో సహితం వీధి దీపాలు వెలగకపోవడంతో స్థానికులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. ఫిర్యాదు చేసినా పట్టించుకునే పరిస్థితులు లేవు. అసలే వర్షకాలం ఎక్కడ గుంత ఉంటుందో తెలియని పరిస్థితి. మరమ్మతులు చేయాల్సిన కాంట్రాక్టర్లు సమ్మెలో ఉండటంతో వీటికి పరిష్కారం లభించడం లేదు.

గణేష్ నిమజ్జనం ముగియడంతో..

11 రోజుల పాటు గణేష్ ఉత్సవాలు ఉండడంతో వీధులన్నీ లైట్లతో వెలిగిపోయాయి. ప్రతి వీధిలో గణనాథుల మండపాలు ఏర్పాటు చేయడంతో వీధి దీపాలు పని చేయకపోయినా వాటి లోటు తెలియలేదు. నిమజ్జనం ముగియడంతో ఒక్కసారిగా వీధి దీపాలు వెలగని ప్రాంతాలు చీకటిమయంగా మారాయి. దీంతో ప్రజలు జీహెచ్‌ఎంసీ అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

పరిష్కారం కోసం చర్యలు

వీధి లైట మరమ్మతుల కోసం ఉన్నతాధికారులకు నివేదించాం. ఉన్నతధికారులు కాంట్రాక్టర్లతో చర్చలు జరుపుతున్నారు. ఒకటి రెండు రోజుల్లో చర్చలు సఫలమై్య అవకాశం ఉంది. త్వరలో అన్నింటికి మరమ్మతులు చేస్తాం.

– ఏఈ, సౌమ్య, సర్కిల్–16 వీధి లైట్ల విభాగం

బహుముఖ ప్రతిభాశాలి ఏఎన్ఆర్

చిక్కడపల్లి: సినీ నటుడు అక్కినేని నాగేశ్వర్‌రావు క్రమశిక్షణతో పట్టుదలతో ఉన్నత శిఖరాలకు ఎదిగారని ఏపీ అధికార భాషా సంఘం పూర్వ అధ్యక్షుడు పి.విజయబాబు అన్నారు. బుధవారం రాత్రి త్యాగరాయ గానసభలో నట సామ్రాట్ అక్కినేని నాగేశ్వర్‌రావు శతజయంతి వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా విజయబాబు మాట్లాడుతూ.. ఏఎన్ఆర్ బహుముఖ ప్రతిభాశాలి అని కొనియాడారు. ఈ సందర్భంగా సినీ, టీవీ నటుడు జెన్నీకి ఆత్మీయ సత్కారం చేశారు.

లెదర్ టెక్నాలజీ హబ్‌ను ఏర్పాటు చేయాలి

ఇందిరాపార్కులో మాదిగ చర్మకారుల సంఘాల జేఏసీ సమావేశం



సమావేశంలో పాల్గొన్న తెలంగాణ మాదిగ చర్మకారుల సంఘాల జేఏసీ నేతలు

కవాడిగూడ: పేదల పాటు బీఆర్ఎస్ ప్రభుత్వం లీడ్ క్యాప్‌ను పూర్తిగా విస్మరించిందని తెలంగాణ మాదిగ చర్మకారుల సంఘాల జేఏసీ కన్వీనర్ కూనపాటి శ్రీనివాస్ అన్నారు. బుధవారం ఇందిరాపార్కులో ఆయన అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సందర్భంగా జేఏసీ చైర్మన్ అరెపల్లి రాజేందర్ మాట్లాడుతూ... గతంలో కాంగ్రెస్ ప్రభుత్వమే లీడ్ క్యాప్‌ను ఏర్పాటు చేసిందని ప్రత్యేక రాష్ట్రంలో లీడ్ క్యాప్‌ను పూర్తిగా గత ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందని మండిపడ్డారు. విడిపోయిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో లీడ్ క్యాప్‌కు పాలక మండలిని ఏర్పాటు చేశారని తెలంగాణలో కూడా కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలో నూతనంగా ఏర్పడ్డ కాంగ్రెస్ ప్రభుత్వం లీడ్ క్యాప్ (తెలంగాణ లెదర్ ఇండస్ట్రీయల్ ప్రమోషన్ కార్పొరేషన్)ను పునరుద్ధరించి ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలన్నారు.

- పాలకమండలిని నియమించి రూ.10వేల కోట్ల బడ్జెటును కేటాయించాలని కోరారు. మాదిగ, మాదిగ ఉపకులాల కులవృత్తి అయిన లీడ్ క్యాప్‌ను ప్రోత్సహించి హెల్త్ ఇన్సురెన్స్, పెన్షన్ సౌకర్యం కల్పించాలన్నారు. తెలంగాణలో ఉన్న 12మినీ లెదర్ పార్కులకు బడ్జెట్ కేటాయించి అభివృద్ధి చేయాలని డిమాండ్ చేశారు. ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫుట్‌వేర్ టెక్నాలజీని రాష్ట్ర వ్యాప్తంగా లెదర్ టెక్నాలజీ హబ్‌ను రూపొందించాలన్నారు. నిరుద్యోగ యువతకు నూతన టెక్నాలజీ కోర్సులను ప్రవేశపెట్టి రాష్ట్ర ప్రభుత్వమే ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించాలని కోరారు. అసెంబ్లీ సమావేశాల్లో డిప్యూటీ సీఎం మల్లుభట్టి విక్రమార్క ప్రకటించిన రెండు మెగా లెదర్ పార్కులను నిర్మించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో వైస్ చైర్మన్ రవీందర్, నోమ రాజు తదితరులు పాల్గొన్నారు.

దీన్‌దయాళ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎంపీ డా. కోవా లక్ష్మణ్



దీన్‌దయాళ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న బీజేపీ నేతలు



పండిత్ దీన్‌దయాళ్‌కు ఘన నివాళులు

కాచిగూడ: భారతదేశ రాజకీయ చరిత్రలో పండిత్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయకు ప్రత్యేక గుర్తింపు ఉందని బీజేపీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎన్.గౌతంరావు అన్నారు. బుధవారం బర్కత్‌పురలోని నగర పార్టీ కార్యాలయంలో పండిత్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా దీన్‌దయాళ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. దీన్‌దయాల్ అంత్యోదయ సిద్ధాంతం చాలా గొప్పదని ఆయన కొనియాడారు. దేశంలో సిద్ధాంతాలకు విలువనిచ్చిన వారిలో దీన్‌దయాళ్ ముఖ్యమైన వ్యక్తి అని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో నేతలు చింతల రాంచంద్రారెడ్డి, మాజీ మంత్రి సి.కృష్ణయాదవ్, ప్రేమ్‌సింగ్ రాథోడ్, సందీప్‌సాయి, అనంతలక్ష్మి, కేశబోయిన శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

దీన్‌దయాల్‌ను యువత ఆదర్శంగా తీసుకోవాలి

కవాడిగూడ: పండిత్ దీన్‌దయాల్ ఉపాధ్యాయ జీవిత చరిత్రను నేటి యువత ఆదర్శంగా తీసుకొని ముందుకు సాగాలని ముషీరాబాద్ నియోజకవర్గం బీజేపీ కన్వీనర్ ఎం. రమేష్‌రాం, కవాడిగూడ బీజేపీ అధ్యక్షుడు ఎంసీ మహేందర్‌బాబు సూచించారు. దీన్ దయాల్ ఉపాధ్యాయ సిద్ధాంతాలకు కట్టుబడి ముందుకు సాగారని ఆయన ప్రవేశ పెట్టిన అంత్యోతయ సిద్ధాంతం మార్గదర్శమని ఆయన పేర్కొన్నారు. బుధవారం ఇందిరాపార్కు చౌరస్తాలో కవాడిగూడ డివిజన్ బీజేపీ కమిటి ఆధ్వర్యంలో పండిట్ దీన్ దయాల్ ఉపాధ్యాయ జయంతి సందర్భంగా ఏర్పాటు చేసిన చిత్రపటానికి నేతలు నివాళులర్పించారు. ప్రతి ఒక్కరూ ఆయన ఆశయ సాధనకు పాటుపడాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో ముషీరాబాద్ బీజేపీ కన్వీనర్ ఎం. రమేష్‌రాం, నాయకులు జి. వెంకటేష్, పరిమళ్ కుమార్, వడ్డేటి దేవేందర్, ఎంసి మహేందర్‌బాబు, ప్రభాకర్ గంగపుత్ర, ఆంజనేయులు, దిలీప్ యాదవ్, చిత్ర కుమార్‌గౌడ్, బొల్ల రమేష్‌బాబు, లింగం గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

దేశం కోసం జీవితం త్యాగం చేసిన మహనీయుడు: ఎంపీ డా. కె. లక్ష్మణ్

చిక్కడపల్లి: బీజేపీ డివిజన్ అధ్యక్షుడు రత్న సాయిచంద్ ఆధ్వర్యంలో గాంధీనగర్‌లో పండిత్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ జయంతి కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. రాజ్యసభ సభ్యుడు, ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు డాక్టర్ కోవా లక్ష్మణ్ ముఖ్యఅతిథిగా హాజరై దీన్‌దయాళ్ ఉపాధ్యాయ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దీన్‌దయాళ్ ఉపాధ్యాయ తన జీవితాన్ని దేశం కోసం త్యాగం చేసిన మహనీయుడని అన్నారు.

సభ్యత్వ నమోదు..

డివిజన్‌లోని బూత్ నంబర్ 127లో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. బీజేపీ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి చూసి ప్రజలు సభ్యత్వం చేయించుకుంటున్నారని ఎంపీ డా. కె. లక్ష్మణ్ అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు రమేష్‌రామ్, పూసరాజు, జైశ్రీ, శ్రీకాంత్, శివకుమార్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

లలితానగర్‌లోని బీజేపీ క్యాంప్ ఆఫీస్‌లో...

ముషీరాబాద్: మానవతావాది, అంత్యోదయ మార్గదర్శకుడు పండిత్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ 108వ జయంతి వేడుకలు బుధవారం ఘనంగా జరిగాయి. అడిక్‌మెట్ డివిజన్‌లోని లలితానగర్‌లోని బీజేపీ క్యాంప్ ఆఫీస్‌లో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు రొయ్యూరు శేషసాయి మాట్లాడుతూ.. నిరుపేదలకు సంక్షేమం అందించాలని తీవ్రంగా శ్రమించి కృషి చేసిన మహనీయుడు దీన్‌దయాల్ అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో నాయకులు నరేష్‌కుమార్, సాయికృష్ణ యాదవ్, ఓంప్రకాష్, మోహన్, ప్రసాద్, గౌరీ శంకర్ తదితరులు పాల్గొన్నారు.



ఇందిరాపార్కు చౌరస్తాలో చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు



లలితానగర్‌లోని బీజేపీ కార్యాలయంలో దీన్‌దయాళ్ జయంతి వేడుకలు

28, 29న తల్లిపాల ప్రాముఖ్యతపై అంతర్జాతీయ సదస్సు



పంజగుట్ట: సుషేనా హెల్త్ ఫౌండేషన్, ధాత్రి మదర్స్ మిల్క్ బ్యాంక్ భాగస్వామ్యంతో ఇండియన్ అకాడమీ ఆఫ్ పీడియాట్రిక్స్, నేషనల్ నియోనాటాలజీ ఫోరం, రిషిహుడ్ యూనివర్సిటీల సహకారంతో తల్లిపాల ప్రాముఖ్యతపై ఈ నెల 28, 29వ తేదీల్లో నాలుగో అంతర్జాతీయ సదస్సు నిర్వహించనున్నట్లు జాతీయ వైద్యకమిషన్ సభ్యుడు డాక్టర్ సంతోష్ కుమార్ క్రాటేటి తెలిపారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో కార్యక్రమ కరపత్రాన్ని డాక్టర్ దుర్గాభవానీతో కలిసి బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మొదటిరోజు నగరంలోని నీలోఫర్, ఈఎస్ఐతో పాటు మొత్తం 10 ప్రముఖ ఆసుపత్రుల్లో దేశవిదేశాల నుంచి వచ్చిన నిష్ణాతులైన వైద్యులతో వర్క్‌షాపు, 29 న మారీగోల్డ్ హోటల్‌లో దేశ విదేశాల నుంచి వచ్చిన 470 మందికి పైగా తల్లిపాల ఎక్స్‌పర్ట్స్‌చే సదస్సులు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. సదస్సును జాతీయ మెడికల్ కమిషన్ చైర్మన్ డాక్టర్ బీఎన్ గంగాధర్ ప్రారంభిస్తారని తెలిపారు.

నిమ్స్‌లో నిజాం ముని మనవడు



రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో నిమ్స్ దవాఖానలో రెండు రోజులుగా ఉచితంగా గుండె ఆపరేషన్లు నిర్వహిస్తున్నారు. బుధవారం నిమ్స్‌ను నిజాం ముని మనవడు సందర్శించారు. ప్రముఖ బ్రిటన్ వైద్యుడు దన్నపనేని రమణ వైద్య బృందం, నిమ్స్ కార్డియో థోరాసిక్ విభాగాధిపతి డా.అమరేశ్వర్రావు సారథ్యంలో చిన్నారులకు మిలినియం బ్లాక్లోని పీడీయాట్రిక్ గుండె విభాగాలను పరిశీలించి వారికీ అందుతున్న చికిత్సను తెలుసుకుని సంతృప్తిని వ్యక్తం చేశారు. అలాగే బ్రిటన్, నిమ్స్ వైద్య బృందాన్ని ఘనంగా సత్కరించారు

– లక్డీకాపూల్

15 రోజులు.. ట్రాఫిక్ మళ్లింపు



వాహనాదారులకు మళ్లించే మ్యాప్



చిక్కడపల్లి ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ వీరేశం

చిక్కడపల్లి: అజామాబాద్ చౌరస్తా వద్ద కచ్చామోరీ పైప్‌లైన్ మరమ్మతుల కారణంగా 15 రోజుల పాటు ట్రాఫిక్‌ను మళ్లిస్తున్నట్లు చిక్కడపల్లి ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ వీరేశం తెలిపారు. ఆర్టీసీ క్రాస్‌రోడ్స్ కింది నుంచి వచ్చే వాహనదారులు వీఎస్టీ చౌరస్తా నుంచి ఎడమ వైపు దారికి మళ్లిస్తున్నట్లు తెలిపారు. ముషీరాబాద్ బస్‌డిపో నుంచి బయోలాజికల్ ఈ లిమిటెడ్ ముందు నుంచి ఎడమవైపు దారి మళ్లిస్తున్నామని పేర్కొన్నారు. అడిక్‌మెట్ నుంచి వచ్చే వాహనాదారులు నేరుగా హిందీ మహావిద్యాలయ చౌరస్తా నుంచి అజామాబాద్ చౌరస్తా వైపు వెళ్లాలని వాహనాదారులకు సూచించారు. స్టీల్ బ్రిడ్జి మీది నుంచి వేళ్లే వాహనాదారులు యథావిధిగా వెళ్లవచ్చు.

28న అక్కినేని చిత్ర గీతావళి

చిక్కడపల్లి: నట సమ్రాట్ అక్కినేని నాగేశ్వర్‌రావు శతజయంతిని పురస్కరించుకొని ఆకాశవీధిలో అందాల జాబిలి శీర్షికతో ఈనెల 28న అక్కినేని చిత్ర గీతావళిని నిర్వహిస్తున్నామని బండారు సుబ్బారావు, పన్నాల బాల్‌రెడ్డి, భీంరెడ్డిలు తెలిపారు. బుధవారం సాయంత్రం వారు వివేక్‌నగర్‌లో మాట్లాడుతూ... సీల్‌వెల్ కార్పొరేషన్, శృతిలయ ఆర్ట్స్ ఆర్ఆర్ ఫౌండేషన్, ఆదర్శ ఫౌండేషన్‌ల సంయుక్త ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. త్యాగరాయ గానసభలో ఉదయం 11.30 నుంచి సాయంత్రం 7.30గంటల వరకు ఈ కార్యక్రమం కొనసాగుతుందన్నారు.

ప్రతిభ గల విద్యార్థులకు ప్రోత్సాహం



రూ.10వేల చెక్కును అందజేస్తున్న వి. శ్రీనివాస్‌రెడ్డి

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: ప్రతిభ ఉన్న విద్యార్థులను నాయిని నర్సింహారెడ్డి ఫౌండేషన్ ప్రోత్సహిస్తుందని ఫౌండేషన్ ప్రధాన కార్యదర్శి వి.శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. బాగ్‌లింగంపల్లిలోని మైనార్టీ బాలికల రెసిడెన్షియల్ విద్యార్థిని ఇన్‌షా ఫాతిమా టెస్ట్‌లో ఉత్తమ ప్రతిభ కనబరిచింది. బుధవారం ఆమె రూ.10వేల చెక్కును ఆయనకు అందజేశారు. ఈ కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపాల్ వాణిశ్రీ, నాయకులు సిరిగిరి శ్యామ్, సిరిగిరి కిరణ్, అనిల్, సాలమ్మ, ఎల్జిబెత్, అనురాధ తదితరులు పాల్గొన్నారు.

మహిళ బ్యాగు చోరీపై జీరో ఎఫ్ఐఆర్

కాచిగూడ: ఓ మహిళ చేతి బ్యాగు చోరీపై కాచిగూడ రైల్వే పోలీసులు జీరో ఎఫ్ఐఆర్‌ను నమోదు చేశారు. రైల్వే ఇన్‌స్పెక్టర్ ఆర్.ఎల్లప్ప తెలిపిన వివరాల ప్రకారం.. మహారాష్ట్రకు చెందిన రేఖా ప్రభాకర్ మంగళవారం ఓఖా – రామేశ్వరం ఎక్స్‌ప్రెస్ రైలులో నగరానికి వస్తుంది. రైలు పూర్ణస్టేషన్ వద్ద ఉండగా సెల్‌ఫోన్, రూ.8వేలు నగదు ఉన్న చేతి బ్యాగు చోరీకి గురైంది. బుధవారం బాధితురాలు కాచిగూడ రైల్వే పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసులు జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేసి తదుపరి విచారణ నిమిత్తం నాందేడ్ రైల్వే పోలీస్ స్టేషన్‌కు బదిలీ చేశారు.

మహిళ మృతదేహం లభ్యం



అర్చన (ఫైల్)

నల్లకుంట: ఓ షాప్ ఎదుట ఓ మహిళ మృతదేహం లభ్యమైన ఘటన నల్లకుంట పోలీస్‌స్టేషన్ పరిధిలో వెలుగు చూసింది. అడ్మిన్ ఎస్సై జె. శ్రీనివాస్‌రావు తెలిపిన వివరాలు.. బుధవారం సాయంత్రం 6 గంటల సమయంలో ఫీవర్ ఆసుపత్రి సమీపంలోని శివానంద్ నగర్‌లో ఓ షాప్ షటర్ వద్ద మహిళ(35) అపస్మారక స్థితిలో పడి ఉంది. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి వెళ్లి చూడగా ఆ మహిళ అనారోగ్యంతో అప్పటికే మృతి చెందింది. శవ పంచనామ నిర్వహించి మృతదేహాన్ని గాంధీ మార్చురికి తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది. కాగా మృతురాలి వద్ద లభించిన ఆధార్ కార్డులోని చిరునామా ఆధారంగా వారాసిగూడ ఎల్ఎన్‌నగర్‌కు చెందిన బాసుపల్లి ప్రసాద్ భార్య బాసుపత్లి అర్చన(35)గా పోలీసులు గుర్తించారు. ఈ మృతురాలి బంధువులు ఎవరైనా ఉంటే నల్లకుంట పోలీసులను సంప్రదించాలని కోరారు.

రిటైర్డ్ ఎంప్లాయీస్‌కు ఆరోగ్య భద్రత కల్పించాలి

కాచిగూడ: రిటైర్డ్ ఎంప్లాయీస్‌కు ఆరోగ్య భద్రత కల్పించాలని తెలంగాణ రిటైర్డ్ పోలీస్ ఆఫీసర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎ.శ్రీనివాస్ రావు తెలంగాణ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఆయన అధ్యక్షతన బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో బుధవారం రాష్ట్ర స్థాయి కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రిటైర్డ్ ఎంప్లాయీస్ హెల్త్‌కార్డ్ పరిధిని రూ.2 లక్షల నుంచి రూ.5లక్షల వరకు పెంచాలని, మెడికల్ అలవెన్స్‌ను రూ.600 నుంచి రూ. 1000 వరకు పెంచాలని కోరారు. రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ ఉద్యోగ విరమణ రోజునే చెక్కు రూపంలో అందేలా చూడాలన్నారు. అసోసియేషన్ సెంట్రల్ ఆఫీస్ కోసం నగరంలో ఒక చోట ప్రభుత్వ భవనం, అలాగే జిల్లా కేంద్రాల్లోనూ భవన నిర్మాణానికి ప్రభుత్వ స్థలాలు కేటాయించాలని కోరారు.

ప్రభుత్వ భూమి కాదని చెప్పినా కూల్చేస్తారా?

బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్ నెం.12 లోని ఏసీబీ కార్యాలయం ఎదురుగా షేక్ పేట మండలం హకీంపేట విలేజ్ సర్వే నెం. 102/ 4/2లో ఉన్న 12 ఎకరాల 2 గుంటల స్థలం బంజారాకుంజ్ ఫ్లాట్ ఓనర్స్ అసోసియేషన్‌కు చెందిందని హైకోర్టు 2001, 2009లోనూ తీర్పునిచ్చినా ఎలా కూల్చివేస్తారని సొసైటీ అధ్యక్షుడు అబ్దుల్ అజీజ్ బిన్ మహ్మద్, సెక్రటరీ కేవీ. నర్సింహారావు ప్రశ్నించారు. సొసైటీ కార్యాల యంలో బుధవారం వారు మాట్లాడారు. 1956 లో ప్రభుత్వానికి డబ్బులు చెల్లించి ఈ స్థలాన్ని మొయినుద్దీన్ ఖురేషికి ప్రభుత్వమే పంచనామా చేసి అలాట్ చేసిందన్నారు. 1994లో రాఘవ సొసైటీకి అలాట్ చేయగా ఇది ప్రభుత్వానికి చెందిందని హైకోర్టు రెండు దఫాలుగా తీర్పుని చ్చిందన్నారు. ఇక్కడ గది నిర్మించి విద్యుత్ కనెక్షన్ కూడా తీసుకున్నామన్నారు. ఇప్పుడు రెవెన్యూ అధికారులు వచ్చి సొసైటీ కార్యాలయ గదిని కూల్చివేయడం తగదన్నారు. ఈ స్థలం ప్రభుత్వానిది కాదని హైకోర్టు తీర్పునిచ్చిన తర్వాత కూడా రెవెన్యూ అధికారులు కోర్టులో అప్పీల్ కూడా చేయలేదని గుర్తు చేశారు. రెవెన్యూ అధికారులు రికార్డులు పరిశీలించి తమకు న్యాయం చేయాలని కోరారు.